విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 23, ఆగస్టు 2025

అటవీశాఖ అధికారులపై ఎమ్మెల్యే దాడులు దారుణం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన కూటమి ప్రభుత్వ శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అటవీ శాఖ అధికారులపై చేసిన దాడులు, దౌర్జన్యాలు హాట్ టాపిక్‌గా మారాయి. చట్టానికి ఎవరూ చుట్టం కాదని, ఎంతటి వారైనా తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యే అయినా క్షమించే ప్రసక్తేలేదని, చట్ట ప్రకారం కేసులను నమోదు చేస్తామని సాక్షాత్తు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చెప్పిన మాటలు బూటకమని మరోసారి రుజువయ్యిందని వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు శిల్పా చక్రపాణిరెడ్డి, కాటసాని రామిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష, శ్రీశైలం నియోజకవర్గ ఇంచార్జీ శిల్పా భువనేశ్వరరెడ్డిలు అన్నారు. నంద్యాల పద్మావతినగర్‌లోని శిల్పా చక్రపాణి రెడ్డి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి దౌర్జన్యాలు, ఆగడాలపై వైసీపీ నేతలు తీవ్రంగా మండిపడ్డారు. అనంతరం జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాను కలిసి శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని, మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని వైసీపీ నేతలు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో ఎరువుల కొరత తీవ్రంగా ఉందని, ఎరువులను టీడీపీ గోడవున్లలో ఉంచుకొని కేవలం టీడీపీకి చెందిన వారికే అందిస్తున్నారని, రైతన్నలకు ఎరువులను అందించి తగిన న్యాయం చేయాలని కోరుతూ డీఆర్‌ఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి తప్ప తాగి రాత్రి 10గంటల ప్రాంతంలో విధినిర్వహణలో ఉన్న అటవీశాఖ అధికారుపై దాడిచేసి, దుర్భాషలాడుతూ దాదాపు 4గంటల పాటు వారిని అటవీశాఖ వాహనంలో దౌర్జన్యంగా ఎక్కించు కొని హింసించిన ఘటనపై కూటమి ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని, ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా ఎంతటి వారైనా అధికారపక్షంలో ఉన్నా సరే కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేవలం బెయిలబుల్ సెక్షన్లతో కేసులు నమోదు చేసి చేతులు దులుపుకున్నారని, సీఎం చంద్రబాబు మాటల్లో ఒకటి చేతల్లో మరోకటిలా ఉందన్నారు. డిప్యూటీ సీఎం, అటవీశాఖ మంత్రి పవన్ కళ్యాణ్ సనాతన ధర్మం అంటూ కొత్తపలుకులు పలుకుతున్న ఈయనకు టీడీపీ ఎమ్మెల్యేకు ఒక ధర్మం... మరోకరికి ఒక ధర్మంలా ప్రవర్తించడం చూస్తే పవన్ కళ్యాణ్ మాటలు సినిమా డైలాగ్ లుగా ఉన్నాయే తప్ప చర్యలు మాత్రం జీరో అయ్యాయని ఎద్దేవా చేశారు. రెడ్ బుక్ రాజ్యాంగంలో టీడీపీ ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి పేరు కనబడలేదా, అతనిపై చర్యలు లేవా, అని మంత్రి నారా లోకేష్‌ను సూటిగా ప్రశ్నించారు. బనగానపల్లె నియోజక వర్గంలో ఇటీవల శ్రీలక్ష్మి నరసింహస్వామి దేవాలయ ప్రతిష్ట కార్యక్రమంలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సోదరుడు బీసీ భూపాల్ రెడ్డి ఏఆర్ కానిస్టేబుల్‌పై చేయి చేసుకోవడం జరిగిందని, అహంకారంతో ఉన్న వీరిపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి డిమాండ్ చేశారు.

స్వామిత్వ సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలి

విశాలాంధ్ర-పాణ్యం: జిల్లాలో జరుగుతున్న స్వామిత్వ సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్ మండల పరిధిలోని భూపనపాడు గ్రామంలో జరుగుతున్న స్వామిత్వ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్వామిత్వ సర్వే కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఈ సర్వే కార్యక్రమాన్ని సంబంధిత అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి ఈనెల 31వ తేదీ లోపల పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా సచివాలయంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రటరీలు బృందాలుగా ఏర్పడి సర్వే చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఆగస్టు 1వ తేదీ నుంచి సర్వే జరుగుతోందని జిల్లాలో 188 గ్రామాల్లో స్వామిత్వ సర్వే చేపట్టడం జరుగుతుందన్నారు. ఇంకా సర్వే టీమ్స్ పెంచి ఆగస్టు 31వ తేదీ లోపల సర్వే పూర్తి చేయాలన్నారు. స్వామిత్వ సర్వే వల్ల ఎలాంటి ఎన్‌క్రోచ్ మెంట్ సమస్యలు ఉండవని, ఎవరి ఆస్తి వారికే చెల్లెందుకు ఈ సర్వే ఉపయోగపడుతుందన్నారు. సర్వే పూర్తి అయిన తర్వాత ప్రతి ఒక్కరికి ప్రాపర్టీ సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి లలితా బాయి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టిన సిబ్బంది

విశాలాంధ్ర - నంద్యాల రూరల్: గురువారం విశాలాంధ్ర పత్రికలో కానరాని పరిశుభ్రత అనే శీర్షికపై అధికారులు స్పందించారు. దీంతో నంద్యాల మండలంలోని పోలూరు గ్రామంలో వీధి వీధినా సర్పంచ్ పొన్నపాటి ప్రతాప్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్యంపై పనులు చేపట్టారు. ముఖ్యంగా పోలూరు గ్రామంలో చెత్తా చెదారంతో నిండిపోయిన కాలువలను గ్రామంలో ప్రధానమైన కూడళ్లు, సచివాలయం ఆవరణలో ఉన్న అంగన్వాడీ కేంద్రం దగ్గర గ్రామ సిబ్బందితో పనులు చేపట్టి పిచ్చి మొక్కలతో చెత్తాచెదారాలతో నిండి మూసుకు పోయిన కాలువలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రతాప్ మాట్లాడుతూ కొన్ని కారణాలవల్ల కాలువలను శుభ్రం చేయలేదని అలాగే తొలగించ లేదన్నారు. ప్రస్తుతం విశాలాంధ్ర పత్రికలో కానరాని పరిశుభ్రత అనే అంశంపై వచ్చిన శీర్షికను దృష్టిలో పెట్టుకొని ఎంపీడీవో సుగుణశ్రీ ఆదేశాల మేరకు కార్యక్రమం చేపట్టమన్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్వచ్ఛంధ్ర- స్వచ్ఛభారత్ అనే నినాదంతో ప్రతి మూడవ శనివారం గ్రామాన్ని పారిశుధ్యం పాటు అన్ని సమస్యపై స్పందించి అభివృద్ధి చేపడుతామని ఆయన అన్నారు. గ్రామ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ పంచాయతీ కార్యదర్శి బీమ్ రెడ్డి సచివాల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా: రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని నంద్యాల పార్లమెంటు టిడిపి ఇంచార్జీ మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు నియోజవర్గ ఎమ్మెల్యే గిత్త జయ సూర్యలు అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్ గార్డెన్ ఫంక్షన్ హాల్ నందు శుక్రవారం 80 బనూరు సహకార సంఘం చైర్మన్ పిక్కిలి శ్రీనివాసులు డైరెక్టర్లుగా గుండ్రెడ్డి తిరుపతిరెడ్డి, వసువుల శేఖర్ లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ముఖ్య అతిథులుగా నంద్యాల టిడిపి పార్లమెంట్ ఇంచార్జీ మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు నియోజవర్గ ఎమ్మెల్యే గిత్త జయసూర్య హాజరయ్యారు. 80 బన్నూరు సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలని చైర్మన్ డైరెక్టర్లకు ఆదేశించారు. వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో కష్టపడ్డ వారికి నామినేట్ పదవులు రావడం గర్వించదగ్గ విషయం అన్నారు.సొసైటీ ద్వారా రైతులకు అన్ని రకాల ఎరువులు అందించడమే కూటమి ప్రభుత్వ దేయమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్, టిడిపి సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ గుండ్రెడ్డి మోహ న్ రెడ్డి, గిరీశ్వర్ రెడ్డి, నందికొట్కూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి, తర్తుర్ ఆలయ చైర్మన్ మందడి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

దేవుని ఆవులను వదిలిపెడితే జరిమానాలే..

విశాలాంధ్ర - రుద్రవరం: దేవుళ్లకు ఆవులను వదిలిపెట్టామని ఆవుల యజమానులు ఇష్టానుసారంగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే జరిమానాలు విధించడం జరుగుతుందని మేజర్ పంచాయతీ సెక్రెటరీ రామకృష్ణ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన దేవుళ్లకు వదిలి పెట్టిన ఆవుల యజమానులకు తెలియజేసేలాగా దండోరా వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో కొందరు వారికి చెందిన ఆవులను దేవునికి వదిలి పెట్టడం జరిగింద న్నారు. ఈ ఆవులు గ్రామంలోని ప్రధాన రహదారుల వెంట గుంపులు గుంపులుగా చేరి గ్రామస్తులకు, ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించేలాగా ఉంటున్నాయన్నారు. వాటి ఆకలిని తీర్చుకునేందుకు గ్రామ సమీపంలోని పంట పొలాలలోకి వెళ్లి రైతులకు నష్టం కలగజేస్తున్నాయంటూ గ్రామస్తులు తెలిపారన్నారు. గ్రామస్తుల, రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఆవుల యజమానులు తప్పనిసరిగా వారికి చెందిన ఆవులను వారి ఇళ్ల వద్దే ఉంచాలన్నారు. ఇందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తే ఆవుల యజమానులపై జరిమానాతో పాటు శాఖపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు.

ఘనంగా శ్రీకృష్ణుని గ్రామోత్సవం

విశాలాంధ్ర-అవుకు: త్రైత సిద్ధాంతం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీకృష్ణుని గ్రామోత్సవాన్ని భక్తులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అవుకు పట్టణంలోని యాదవ వీధిలో ఉన్న గడేకారి జయ నాగేంద్ర ప్రసాద్ ఇంటి వద్ద ఈనెల 16వ తేదీన ప్రబోధానంద స్వామి ఆశీస్సులతో త్రైత సిద్ధాంతం ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని ప్రతిమను ప్రతిష్టించి కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ప్రతిరోజు స్వామి వారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ఏడవ రోజు శుక్రవారం శ్రీకృష్ణ ప్రతిమ గ్రామోత్సవం కార్యక్రమాన్ని మార్కెట్ వీధి, బస్టాండు, తేరు వీధి, సెంటరు, మండపం వీధి, చాకలిపేట మీదుగా అంగరంగ వైభవంగా సాగింది. ఈ కార్యక్రమంలో జయ నాగేంద్ర ప్రసాద్, నరేంద్ర, చంద్రమోహన్,శ్రీనివాసులు, ఆనంద ప్రసాద్, శ్రీనివాసులు, జయన్న తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా పారిశుద్ధ్య పనులు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: మండలంలోని నంది పాడు గ్రామంలో రెండు రోజులుగా విస్తృతంగా పారిశుద్ధ్య పనులను చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి రాఘవరెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పారిశుద్ధ్య కార్మికులు జేసీబీ, ట్రాక్టర్ల సహాయంతో పూడిపోయిన డ్రైనేజీ కాలువలను పరిశుభ్రం చేశారు. గ్రామ మధ్యలోనే శివాలయం నుండి ప్రధాన రోడ్డుకు,అక్కడినుండి తిమ్మనాయుని పేట రోడ్డులోని రావి చెట్టు వరకు పనులు చేశారు. సీసీ రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ కాలువలు చెత్తాచెదారంతో పూడిపోవడంతో పాటు కంపచెట్లు పెరిగి ఇబ్బందిగా మారింది. డ్రైనేజీ కాలవల పూడికతో మురుగునీరు సిసి రోడ్డుపై ప్రవహించడంతోపాటు కాలువలో నిల్వ మురికి నీరుతో దోమలు వృద్ధి చెందడంతో పాటు కంపు వెదజల్లుతుండేది. దీంతో పంచాయతీ కార్యదర్శి ప్రత్యేక దృష్టి సారించి పారిశుద్ధ్య పనులను చేపట్టారు. జెసిబి రెండు ట్రాక్టర్ల ద్వారా చెత్త చెదారంతో పాటు కంప చెట్లను ఊరి బయట సంపద కేంద్రానికి తరలించారు. పరిసరాల పరిశుభ్రతకు గ్రామ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఇంట్లోని చెత్తాచెదారాన్ని కాలువలోకి వేయకుండా చెత్త బండి లోకి వేయాలని కోరారు. ప్రధానంగా రస్తాకు ఇరువైపులా డ్రైనేజీ కాలువలను పరిశుభ్రం చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు వరం

విశాలాంధ్ర - చాగలమర్రి : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు వరం అన్ని నంద్యాల జిల్లా ఏపిఎస్ఆర్‌టిసి రీజనల్ మేనేజర్ రజియా సుల్తానా తెలిపారు. స్థానిక ఆర్‌టిసి బస్టాండును ఆమె శుక్రవారం తనిఖీ చేసి ప్రాంగణాన్ని, దుకాణ సముదాయాన్ని, మరుగు దొడ్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళల ఉచిత బస్సు ప్రయాణం లో ఎలాంటి పిర్యాదులు లేవన్నారు. జిల్లా లోని 7 డిపోల పరిధిలో మొత్తం 373 బస్సులు తిప్పుతున్నామన్నారు. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా 750 ఎలక్ట్రిక్ బస్సులు వస్తున్నాయని అందులో మన జిల్లాకు అందులో కొన్ని బస్సులను కేటాయిస్తారన్నారు. జిల్లాలో 51 విద్యార్థి బస్సులు ఉన్నాయన్నారు. గత ఏడాది 75శాతం ఉన్న ఆదాయం ఈ ఏడాది 85 శాతానికి పెరిగిందన్నారు. ఆగస్టు 15 నుంచి జిల్లాలో బస్సులలో 4.03 లక్షల మంది ప్రయాణం చేయగా అందులో 1.16 లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేసారన్నారు. ఈ ఉచిత ప్రయాణం వల్ల సుమారు 50 లక్షల మంది మహిళలకు ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందన్నారు. ఈఈ ఎన్ఎస్ఆర్ నాయుడు, ఇన్‌చార్జ్ డిఎం నాగ రాజు, సూపరెండెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాజకీయ ఎదుగుదలను ఓర్వలేకే ఆరోపణలు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: తన రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేకనే తనపై ఆరోపణలు చేస్తున్నారని నంద్యాల టీడీపీ 36వ వార్డ్ ఇంచారీ మారుతి ప్రసాద్ అన్నారు. శుక్రవారం. స్థానిక నిశాంత్ భవన్ ఆవరణలో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ నంద్యాల ప్రజా చైతన్య వేదిక కన్వీనర్ దేరంగుల చంద్రశేఖర్ తనపై చేస్తున్న ఆరోపణలన్ని నిరాధారమని, తన రాజకీయ ఎదుగుదల ఓర్వలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. తనపై వచ్చిన భూకబ్జాలకి సమాధానంగా ప్రత్యర్థి చూపించిన సర్వే నెంబర్ గల స్థల యజమానిని పిలుచుకొని వచ్చి మీడియా ముందు హాజరు పరిచారు. సదరు స్థల యజమాని తన స్థలం ఎవరు కబ్జా చేయలేదని, మారుతి ప్రసాద్‌కి తన స్థలానికి ఎలాంటి సంబంధం లేదని మీడియా ముందు చెప్పుకొచ్చాడు. తన మీద తప్పుడు ప్రచారం చేసిన ముగ్గురిపై ఇప్పటికే చాలా చీటింగ్ కేసులున్నాయని, పోలీస్ స్టేషన్లో ఎఫ్ఐఆర్ బుక్ అయిందని, తనపై చేసిన తప్పుడు ఆరోపణలపై టూ టౌన్ పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ చేశానని మారుతి ప్రసాద్ తెలిపారు. రజక కులానికి సంబంధించిన నల్లగట్ల రాజు, పుల్లయ్య దగ్గర చికెన్ వేస్ట్ కాంట్రాక్ట్ ఇప్పిస్తామని చెప్పి రూ.1.60 లక్షల డబ్బులు తీసుకున్నారని, వైస్సార్ నగర్ కాలనీలో మార్కాపురం వారికి సంబందించిన ప్లాట్లను కబ్జా చేసి, వాటిని దొంగ పట్టలు పుట్టించి నలుగురు వ్యక్తులకు తాకట్టు పెట్టి డబ్బులు ఇప్పించుకొని ఇప్పుడు డబ్బులు ఇవ్వమని అడిగితే వాళ్ళను బెదిరించుకుంటూ తిరుగుతున్నారని ఆరోపించారు. నంద్యాల 36వ వార్డులో మంత్రి ఎన్ఎండీ ఫరూక్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ నాయకత్వంలో వార్డులో పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ ముందుకు సాగుతున్నామని ఆయన వివరించారు.

గణేష్ ఉత్సవాలు పటిష్టంగా నిర్వహించాలి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: గణేష్ ఉత్సవాలను పటిష్టంగా నిర్వహించడం తో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలను జరగకుండా చర్యలు తీసు కోవాలని సంబంధిత అధికారులు గణేష్ కమిటీ సభ్యులను జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో గణపతి ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాతో కలిసి సంబంధిత అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలల్లో భాగంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు సమన్వయం చేసుకుంటూ విజయవంతంగా నిర్వహించాలని, నంద్యాల చిన్న చెరువులో నిమజ్జనం కార్యక్రమం నిర్వహించనున్నందున అక్కడ 5 నిమజ్జన పాయింట్స్ ఏర్పాటు చేయడంతో పాటు బండ్ పటిష్ఠంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్, డిఆర్‌ఓ రామునాయక్, ఏఎస్పీ మంద జావలి అల్ఫోన్స్, ఆర్డీఓ విశ్వనాథ్, ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి, జిల్లా అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటు ఆశా వర్కర్ మృతి

విశాలాంధ్ర - జూపాడు బంగ్లా: జూపాడుబంగ్లా గ్రామంలో అడ్డాకుల పార్వతమ్మ ఆశా వర్కర్‌గా విధులు నిర్వహిస్తోంది. శుక్రవారం హఠాత్తుగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి ముగ్గురు ఆడపిల్లలు, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారని, చిన్నప్పుడే పిల్లలు తల్లిని కోల్పోవడం చాలా బాధాకరమని బంధువులు తెలిపారు. ఆశా వర్కర్ పార్వతమ్మ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న నందికొట్కూరు నియోజవర్గ ఎమ్మెల్యే గిత్త జయసూర్య జూపాడుబంగ్లా గ్రామానికి చేరుకొని, ఆమె పార్థేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పిల్లలను ఓదార్చారు. ప్రభుత్వం అండగా ఉంటుందని వారికి భరోసా నిచ్చారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ సుధాకర్, జంగాల పెద్దన్న, రవి కుమార్ యాదవ్, సుబ్బన్న, షాలు, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులచే వరినాట్లు

విశాలాంధ్ర - ఉయ్యాలవాడ: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు శుక్రవారం నాడు ఓ ప్రత్యేక అనుభవాన్ని పొందారు. ఆదర్శ పాఠశాల విద్యార్థులు సమీపంలోని ఉల్లిపాయ పంట తోటను సందర్శించారు. పొలంలో విద్యార్థులు స్వయంగా వరి నాటు వేశారు. విద్యార్థులు వ్యవసాయ పద్ధతులు, ఆధునిక సాగు, సాంకేతికతలు, ఉల్లిపాయ సాగులో విత్తనం నాటడం తదితర ప్రక్రియలను ప్రత్యక్షంగా చూశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి విద్యార్థులతో మాట్లాడుతూ వ్యవసాయం అంటే కేవలం పంటలు పండించడం మాత్రమే కాదని, అందులో పరిశోధన ఆర్గానిక్ వ్యవసాయం వంటి విస్తృత అవకాశాలున్నాయన్నారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, అగ్రికల్చర్ ట్రైనర్ హుస్సేన్‌వలి ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ ఇలాంటి సందర్శనలు విద్యార్థులకు రైతుల కష్టాలను ఎలా అర్థం చేసుకోవాలో వివరించారు.

నార్కోటిక్ డ్రగ్స్, యాంటీబయోటిక్స్‌పై అవగాహన

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: పట్టణం తేజస్విని హొటల్ కాన్ఫ రెన్స్ హాల్ నందు నార్కో టిక్ డ్రగ్స్, యాంటీ బయోటిక్స్ వినియోగంపై అవగాహన సదస్సు ఏర్పా టు చేశారు. డ్రగ్ ఇన్స్పెక్టర్ హనుమన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎన్.యుగంధర్ బాబు, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకట రమణ, కర్నూలు డ్రగ్స్ ఎడి రమాదేవి తదితరులు పాల్గొన్నారు. అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ మెడికల్ షాప్ యజమానులు డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండా పేషెంట్లకు ఎలాంటి ఎన్ఆర్ఎక్స్ మందులు, యువతకు మత్తునిచ్చే మందులు ఇవ్వరాదని అలా అడిగిన వారి వివరాలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వీటిపై ఈగల్ టీమ్ ఎప్పటికప్పుడు నిఘా వుంచి గమనిస్తూ ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దామోదర్ రెడ్డి, ఈగల్ టీమ్‌తో పాటు జిల్లాలోని మెడికల్ ఏజెన్సీ యజమా నులు, కెమిస్ట్, డ్రగ్గిస్ట్‌లు, మెడికల్ షాప్ యజమానులు పాల్గొన్నారు.

డీజేకు అనుమతి లేదు

విశాలాంధ్ర - చాగలమర్రి : వినాయక చవితి ఉత్సవాలలో డిజేలకు ఎలాంటి అనుమతి లేదని చాగలమర్రి ఎస్సై సురేష్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో జరిగిన పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సురేష్ మాట్లాడుతూ పండుగలను ప్రశాంత వాతావరణంలో ఆనందంతో జరుపుకోవాలన్నారు. వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసేవారు తమ అనుమతి తప్పనిసరి తీసుకోవాలన్నారు. మండపాల దగ్గర వారే కమిటీ ఏర్పాటు చేసుకొని పర్యవేక్షించు కోవాలన్నారు. పోలీస్ సిబ్బంది కూడా పర్యవేక్షణ కూడా ఉంటుందన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు త్రినేత్ర మోహన్ రెడ్డి, కమిటీ అధ్యక్షుడు గుత్తి నర్సింహులు ఉపాధ్యక్షుడు సల్లా నాగరాజు వివిధ గ్రామాల పెద్దలు జయదేవరెడ్డి, హనీఫ్, జమాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - ప్యాపిలి: పట్టణంలో శుక్రవారం ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ఆకస్మికంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనం రుచి, నాణ్యతపై ఎమ్మెల్యే ప్రత్యక్షంగా ఆరా తీశారు. అనంతరం పట్టణానికి చెందిన కుళ్ళయప్ప రోడ్ ప్రమాదంలో దురదృష్టవశాత్తు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై, ఆయన కుటుంబానికి టీడీపీ తరఫున రూ.5 లక్షలు ఆర్థిక సాయం అందించారు. తదనంతరం ప్రభుత్వ అతిథి గృహంలో అధికా రులతో, టిడిపి నాయకులతో సమావేశం అయ్యారు. మండలంలో ఎప్పటికప్పుడు అధికారులు ప్రజల సమస్యలను పరిష్కరించాలని, గ్రామాలలో ప్రజలు రోగాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ప్లాస్టిక్ కవర్లు విక్రయించిన వారిపై జరిమాన

విశాలాంధ్ర - బనగానపల్లె : పట్టణంలో ప్లాస్టిక్ కవర్లు విక్రయించిన వారిపై జరిమాన విధించినట్లు మేజర్ గ్రామ పంచాయతీ ఈవో బొమ్మిరెడ్డి సతీష్ కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం నాడు పట్టణంలో ప్లాస్టిక్ నిషేధం లో భాగంగా మేజర్ గ్రామ పంచాయతీ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ముగ్గురు వద్ద నుండి ప్లాస్టిక్ కవర్లు లభించగా ఒక్కొక్కరికి వెయ్యి చొప్పున రూ.3 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. పట్టణంలో ప్లాస్టిక్ కవర్లు నిషేధం ఉందని, అతిక్రమించి ఎవరైనా అమ్మినచో జరిమాన విధిస్తామన్నారు.

మానసిక ఆరోగ్యం, శ్రేయస్సుపై అవగాహన

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: పట్టణ పరిధిలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు శుక్రవారం మానసిక ఆరోగ్యం శ్రేయస్సుపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎం.వేణుగోపాల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఆరోగ్యం పెంపొందించుకోవాలని, ఒత్తిడిని తట్టుకోవాలని, ఆత్మహత్య ఆలోచనల వైపు వెళ్ళవద్దని సూచించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాయలూరు ఆరోగ్య కేంద్రం వైద్యుడు రాబర్ట్ కెన్నెడీ మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడిని జయించడానికి యోగా, ధ్యానం చక్కగా ఉపయోగపడతాయని తెలిపారు. ఫార్మసిస్టు ఎల్.ముని స్వామి ఆలోచనలను, అభిప్రాయాలను ఇతరులతో పంచుకోవడం ద్వారా ఒత్తిడిని తట్టుకోవచ్చని తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ హెచ్. రామసుబ్బారెడ్డి, యు.వెంక టేశ్వర రెడ్డి, ఇ.భాస్కర రెడ్డి, ఎ.కృష్ణ దాసు, ఎ.కృష్ణ శశాంక పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు సురక్షితం

విశాలాంధ్ర - మిడుతూరు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ప్రైవేట్ వైద్యశాలలను ఆశ్రయించకుండా, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలను సురక్షితంగా, అనుభవజ్ఞులచే ప్రసవాలు చేస్తున్నట్లు తలముడిపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మద్దిలేటి, స్త్రీ వ్యాధి నిపుణురాలు డాక్టర్ సుజాత తెలిపారు. శుక్రవారం తలముడిపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెలివరీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగేళ్ల నుంచి ఇప్పటివరకు తలమడిపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 112 కేసులు డెలివరీ చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ హాస్పిటల్లో అన్ని మౌలిక వసతులు ఉన్నాయని, ప్రైవేట్ వైద్యశాల కంటే మెరుగైన వైద్యం అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి

విశాలాంధ్ర - చాగలమర్రి: ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ప్రాణదాతలు కావలని సహారా సోషల్ సర్వీస్ అండ్ బ్లడ్ డోనర్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు హుసేన్‌ఖిలాల్, ఉపాధ్యక్షుడు కరిముల్లా, కోశాధికారి అబ్దుల్లాలు అన్నారు. శుక్రవారం శ్రీ వాసవి డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముందుగా సహారా స్వచ్ఛంద సంస్థ, డిగ్రీ కళాశాల విద్యార్థులు రక్తదానం పై గాంధి విగ్రహం వరకు అవగాహన ర్యాలీ నిర్వంహించారు. సుమారు 150 మంది నుండి కడప జిల్లా ప్రొద్దుటూరు సురక్ష బ్లడ్ బ్యాంకు చైర్మన్ ఓబులరెడ్డి, మేనేజర్ మణి ఆధ్వర్యంలో రక్తాన్ని సేకరించారు. అనంతరం 50 సారి రక్తదానం చేసిన సహారా స్వచ్ఛంద సంస్థ ట్రెజరర్ అబ్దుల్లాను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చక్రం షబ్బీర్, నంద్యాల జిల్లా బిసిసెల్ స్పోక్ పర్సన్ సల్లానాగరాజు, కళాశాల కరస్పాండెంట్ రఘురాం, కార్యదర్శి పుల్లారెడ్డి, మదళపల్లె సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజలందరికి చేరాలి

విశాలాంధ్ర - వెలుగోడు : ప్రభుత్వ పథకాలు ప్రజలందరికి చేరాలి శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే అధ్యక్షతన శుక్రవారం వేల్పనూరు నందు శ్రీశైలం నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి పథకం కార్యక్రమం మరియు మార్కెట్ యార్డు, సొసైటీ పాలకవర్గాల ప్రమాణస్వీకార కార్యక్రమాలపై చర్చించచారు.

అతి ఉత్కృష్ట సేవ పథకం ప్రశంసించిన డీఎస్పీ

విశాలాంధ్ర-డోన్ : డోన్ పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఏ.మాదన్న గత 25 ఏళ్లుగా పోలీసు విధులకు చేస్తున్న విశిష్ట సేవల గాను భారత ప్రభుత్వం ఆయనకు అతి ఉత్కృష్ట సేవా పథకాన్ని ఇచ్చిందాన్న సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం డోన్ సబ్ డివిజన్ డిఎస్పి పి.శ్రీనివాసులు అనాధికారికంగా ఆయనకు ఆ పథకాన్ని అందజేసి అభినందించారు. డీఎస్పీ మాట్లాడుతూ హెడ్ కానిస్టేబుల్ మాదన్న కథ 25 ఏళ్లుగా మా డిపార్ట్మెంట్లో నీతి, నిజాయితీ, కృషి, అంకితభావంతో పని చేస్తున్నారన్నారు. ఇందుకు గుర్తుగా ఆయనకు అతి ఉత్కృష్ట సేవా పథకం రావడం గర్వించదగ్గ విషయమన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 23, ఆగస్టు 2025

పారిశ్రామిక రంగంలో గణనీయమైన ప్రగతి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : జిల్లా పారిశ్రామికంగా గణనీయమైన ప్రగతి సాధిస్తోందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో బిజినెస్ రిఫార్మ్స్ యాక్షన్ ప్లాన్ -2024కు సంబంధించి పరిశ్రమల యాజమాన్యాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగా కర్నూలు జిల్లా ఓర్వకల్లు హబ్‌లో 5 వేల ఎకరాల్లో జైరాజ్ ఇస్పాత్, రిలయన్స్, అగస్త్యా, డ్రోన్స్ హబ్ తదితర కంపెనీలను ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. ఈ పరిశ్రమల ద్వారా వేల మందికి ఉపాధి కలుగుతుందన్నారు. పారిశ్రామిక హబ్‌కు నీటి సరఫరా పనులు కూడా 80శాతం పూర్తయ్యాయని, రోడ్లు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. జిల్లా మంత్రి టి.జి.భరత్ పరిశ్రమల శాఖకు మంత్రిగా ఉన్నందున, వారి కృషి వల్ల కూడా జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి సాధ్యమవుతోందని కలెక్టర్ తెలిపారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా పరిశ్రమల స్థాపనకు వేగంగా అనుమతులు మంజూరు చేస్తున్నామన్నారు. రెవెన్యూ, ఎలక్ట్రికల్, బాయిలర్స్, పొల్యూషన్ కంట్రోల్, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, లేబర్, అగ్నిమాపక శాఖ తదితర 18 శాఖలకు సంబంధించి గడువు లోపు అనుమతులు మంజూరుచేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో భాగంగా అనేక చర్యలు చేపట్టిందని కలెక్టర్ తెలిపారు. బిజినెస్ రీఫార్మ్ యాక్షన్ ప్లాన్ 2024కు సంబంధించి 435 రికమండేషన్స్‌తో కేంద్ర ప్రభుత్వ సంస్థ డిపార్ట్మెంట్ ఫర్ ప్రమోషన్ ఇండస్ట్రీ మరియు ఇంటర్నల్ ట్రేడ్ వారి ద్వారా ఫీడ్బ్యాక్ సర్వే నిర్వహిస్తోందన్నారు. సమావేశంలో ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి, డీడీ గ్రౌండ్ వాటర్ శ్రీనివాసులు,ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్ రెడ్డి, జైరాజ్ ఇస్పాత్, జియో మైసూర్, రిలయన్స్, అగస్త్యా తదితర పారిశ్రామిక సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.

గుంతలమయమైన రోడ్లు..

విశాలాంధ్ర - హొళగుంద: దేశ పురోగతికి గ్రామీణ ప్రాంతాలు పట్టుకొమ్మల ఉంటే దేశ ప్రగతికి రహదారులు చిన్న హోలుగ నిలుస్తాయి. అయితే ధనాపురం వయా హెబ్బటం, హొళగుంద ప్రజలు రోజు ఆదోనికి అధ్వాన్నంగా ఉన్న రోడ్డుమీద ప్రయాణించి అతి కష్టం మీద చేరుకుంటున్నారు. భారీ వర్షానికి రోడ్లు గుంతలు గుంతలుగా ఏర్పడి, వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారాయి. రోడ్లు చిత్తడిగా, బురద పచ్చడిగా ఉండడంతో ప్రజలు నానా అవస్థలుపడి గుంతల రోడ్డును దాటుతూ తమ పనులను చేసుకొని వెళుతున్నారు. రోడ్డు మరమ్మతుకు నిధులు మంజూరయ్యా యంటూ గతంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు పూజలు చేసి రోడ్డు పనులు ప్రారంభించిన రోడ్డు పనులను కాంట్రాక్టర్ పూర్తి చేయకుండా అర్ధాంగా వదిలేయడంతో రోడ్డు పరిస్థితి యధాస్థితికి నెలకొనిందని గ్రామీణ ప్రాంత ప్రజలు విమర్శించారు. ప్రజలు వ్యక్తిగత, ప్రభుత్వ పనుల కోసం ఆదోని, హొళగుంద తదితర ప్రాంతాలకు తిరగాలంటే గగనంగా ఉన్నదని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. రోడ్డు మరమ్మతు చేయాలంటూ సంబంధిత అధికారులకు ఎన్నోసార్లు విన్నవించుకున్న పట్టించుకునే నాథుడు కరువ య్యారని ప్రజలు ఆరోపించారు. రోడ్డు సక్రమంగా లేక బస్సులు సమయానికి రాక తీవ్ర ఇబ్బంది పడుతున్నామని ప్రజలు వాపోయారు. ఎలాగోలా వచ్చే ఆర్టీసీ బస్సులు గుంతలు రోడ్లను దాటుతూ మార్గ మధ్యలో చెడిపోవడం వల్ల గ్రామాలకు చేరుకోవాలంటే కష్టంగా ఉన్నదని విద్యావంత యువకులు తెలిపారు. రోడ్డు నిర్మించాలంటూ రెండసార్లు మండల సర్వసభ్య సమావేశాన్ని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు బహిష్కరించి నిరసన చేసిన ఫలితం లేకుండా పోయిందని ఎంపీటీసీలు విలేకరుల ముందు ఆవేదన చెందారు. రోడ్డు గుంతలమయంగ చెరువుల ఏర్పడి బురద చిత్తడిగా ఉండడంతో కొందరు గజ్జిహళ్లి, పెద్ద హరివాణం మీదుగా ప్రయాణిస్తే మరికొందరు సంతే కుడ్లూర్ మీదగా ఆదోనికి ప్రయాణిస్తున్నారు. హొళగుంద నుండి ఎల్లార్తి, ముద్దనగిరి, కమ్మరిచేడు మీదుగా ప్రజలు అధిక చార్జీలు చెల్లించి ఆటోల ద్వారా ఆదోనికి తరలి వెళ్తున్నారు. రోడ్డు అధ్వాన్న దుస్థితి చేరుకోవడం వల్ల ప్రజలు విసుగెత్తిపోయారు. రోడ్డు రవాణా అస్తవ్యస్తంగా ఉండడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నా సంబంధిత అధికారులకు ఏమి పట్టనట్లు ఉన్నదని ప్రజలు అధికారులపై ఆగ్రహించారు. రోడ్డు నిర్మించాలంటూ ఆలూరు నియోజకవర్గం టీడీపీ ఇంచార్జీ వీరభద్ర గౌడ ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. ధనాపురం రోడ్డు వెంటనే ప్రారంభించాలంటూ తుంగభద్ర ఎల్ ఎల్ సి డిస్ట్రిబ్యూట్ కమిటీ చైర్మన్ ఎం వెంకట శివప్రసాద్, టిడిపి నాయకులు రాజ పంపన గౌడ, కే వేణుగోపాలరావు, ఎం.శ్రీనివాసరావు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్ ఈ మహేశ్వర్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. రోడ్డు మరమ్మతు చేయాలంటూ పలు రాజకీయ పార్టీ నాయకులు, వామపక్ష పార్టీ నాయకులు, స్వచ్ఛంద సేవా సంఘం సభ్యులు సంబంధిత అధికారులకు ఫిర్యాదించి పాదయాత్ర చేశారు. హొళగుంద నుండి ధనాపురం వరకు కొత్త రోడ్డు నిర్మిస్తే సుఖకరమైన ప్రయాణం జరుగుతుందని ప్రజలు అన్నారు. రోడ్డుమీద ప్రయాణించాలంటే భయం భయంగా ఉన్నదని, అధ్వానంగ ఉన్నగుంతల రోడ్డులో ప్రయాణించి వాహనాల సామానులు తెగిపోతున్నా యని, దీనివల్ల ఆర్థిక నష్టం జరుగుతుందని వాహనాల యజమానులు స్పష్టం చేశారు. రోడ్డుమీద ప్రయాణిస్తే నడుముల నొప్పులు తీవ్రంగా బాధిస్తున్నాయని వాహనాల డ్రైవర్లు ఆరోపించారు. జిల్లా మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఆలూరు నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ బి వీరభద్ర గౌడ, ఎమ్మెల్సీలు బిటి నాయుడు, డాక్టర్ మధుసూదన్, ఎమ్మెల్యే బివిరుపాక్షి, జిల్లా కలెక్టర్, శ్రద్ధ వహించి ధనాపురం నుండి హొళగుంద వరకు కొత్త రోడ్డు నిర్మించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

25, 26 తేదీల్లో సివిల్, ఏపీఎస్పీ కానిస్టేబుళ్ళ ఎంపిక

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: జిల్లా ఎపిఎస్పీ రెండో బెటాలియన్ పోలీసు పెరేడ్ గ్రౌండ్లో ఎస్‌టీసీ కానిస్టేబుళ్ళ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియకు హాజరై, ఎస్‌సీటీ సివిల్, ఎపిఎస్పీ ఉద్యోగాలకు ఎంపికైన పురుష, స్త్రీ అభ్యర్థులు ఆగష్టు 25, 26 తేదిలలో కర్నూలు జిల్లా పోలీసు (కొండా రెడ్డి బురుజు దగ్గర) కార్యాలయంలో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ శుక్రవారం ఓ ప్రక టనలో తెలిపారు. అభ్యర్థులు సెలక్షన్ ప్రక్రియలో అప్పుడు అప్లికేషన్‌తో జత పర్చిన అన్ని ధృవ పత్రాల ఒరిజినల్ సర్టిఫికేట్స్, గెజిటెడ్ అధికారితో అటెస్టేషన్ చేయించిన 3 సెట్ల జిరాక్స్ కాపీలను, 4 పాస్పోర్టు సైజ్ కలర్ ఫోటోలను తీసుకుని రావాలని జిల్లా ఎస్పీ తెలిపారు.

మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు

విశాలాంధ్ర-పత్తికొండ: పద్మ విభూషణ్, సినీ నటుడు మెగాస్టార్ చిరంజీవి 70వ జన్మదినం సందర్భంగా అఖిల భారత చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు వైపి క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా జనసేన నియోజకవర్గ ఇన్చార్జి సిజి. రాజశేఖర్ మాట్లాడుతూ రక్తదానం చేయడం వలన ఆపదలో ఉన్న వారి నిండు ప్రాణం కాపాడిన వారు అవుతామని తెలిపారు. అనంతరం చిరంజీవి అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఖాజా హుస్సేన్, రామచంద్ర, సలీం, జయరాముడు, రామకృష్ణ, వీరేష్, రవి, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు వరకు రోడ్డు వేయాలి

విశాలాంధ్ర - సి.బెళగల్: మండలంలోని పోలకల్ గ్రామం నుండి ఎమ్మిగనూరు వరకు 30 కిలోమీటర్లు రోడ్డు వేయాలని కంబదహాల్ గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. మండల పరిధిలోని కంబదహాల్ గ్రామంలో శుక్రవారం పోలకల్ గ్రామం నుండి రోడ్డు చాలా అధ్వానంగా ఉందని ఆ గ్రామ ప్రజలు ధర్నా నిర్వహించి, పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. గ్రామస్తులంతా రోడ్డుకు అడ్డంగా నిలబడి రోడ్డుపై నిలబడి ధర్నా చేయడంతో వాహనాలు నిలిచి రాకపోకలు నిలిచిపోయాయారు. ఎన్నోఏళ్లుగా ఎన్ని ప్రభుత్వాలు మారినా రోడ్డు పురోగతి మారడం లేదని అధికారులు, నాయకులు, ఎమ్మెల్యే, ఎంపీలు ఎవరూ కనీస స్పందన చూపకపోవడం సిగ్గుచేటని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈతో సమస్యలకు సత్వర పరిష్కారం

విశాలాంధ్ర - బళ్లారి చౌరస్తా : డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ కార్యక్రమంతో విద్యుత్ వినియోగదారుల సమస్యలను సత్వరమే పరిస్కారం లభిస్తుందని ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఎం.ఉమాపతి తెలిపారు. శుక్రవారం కర్నూలు విద్యుత్ భవన్ లో ఆయన డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో 18 ఫిర్యాదులు అందాయి. కాగా పోల్ సంబంధిత, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్, విద్యుత్ సరఫరాలో అంతరాయంలో వోల్టేజ్ హెచ్చుతగ్గులు, సరఫరాలో తరచూ అంతరాయం, కొత్త సర్వీస్ల విడుదల తదితర సమస్యలపై విద్యుత్ వినియోగదారులు డయల్ యువర్ విద్యుత్ ఎస్ ఈ ప్రోగ్రాంలో ఫిర్యాదు చేశారు.

గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: నగరంలో వచ్చే నెల 4న నిర్వహించనున్న గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన మున్సిపాల్టీతో పాటు వివిధ శాఖల అధికారులతో కలిసి వినాయక ఘాట్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మునుపటి కంటే మెరుగ్గా ఏర్పాట్లు చేయాలని, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇతర శాఖల అధికారులతో మున్సిపల్ సిబ్బంది సమన్వయం చేసుకుని, త్వరగా పనులు ప్రారంభించాలని సూచించారు. కెసి కెనాల్‌కు మరమ్మత్తు పనులు, ఘాట్‌కు పెయింటింగ్, వేదిక, సౌండ్ సిస్టం, క్రేన్లు, గజ ఈతగాళ్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మార్వో రవికుమార్, డిఎస్పీ బాబు రాజేంద్ర ప్రసాద్, ఎస్ఈ శేషసాయి, ఎంఈ మనోహర్ రెడ్డి, డిఈ గంగాధర్, ఏఈ భాను ప్రకాష్, ఖాసిం, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, సిఐలు శేషయ్య, హేమంత్ కుమార్ రెడ్డి, నాగరాజ రావు, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

ఇక మేం జీవించేదెలా..

- ఎడాపెడా వైకల్య శాతం కుదింపు
- ఇన్నాళ్లూ ఆ డబ్బులే జీవనాధారం
- దివ్యాంగులనూ దయతలచని సర్కారు

విశాలాంధ్ర - ఆలూరు : ఇక మేం జీవించేదెలా అంటూ దివ్యాంగుల గుండెల్లో వణుకు పుడుతోంది ప్రభుత్వ తీరుతో. రీవెరిఫికేషన్ అంటూ అర్హులను సైతం అనర్హులుగా మారుస్తోంది. ఇప్పుడిప్పుడే ఇతరులపై ఆధారపడకుండా పింఛన్ మీద ఆధారపడి జీవించే దివ్యాంగుల్లో మరలా విడుగుపడినట్లు అయ్యింది. ఆలూరు మండల కేంద్రంలో దివ్యాంగుల పింఛన్ తొలగింపుపై రోడ్లు భవనాల అతిథి గృహం నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు దివ్యాంగులు ర్యాలీగా వెళ్లి, ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు స్థానిక ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి మద్దతునిచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో దివ్యాంగుల పింఛన్లను ఎడాపెడా కత్తిరిస్తున్న చంద్రబాబు సర్కారు అనైతికంగా వ్యవహరించేందుకూ పోతోంద న్నారు. కొత్తవి ఇవ్వకపోగా ఉన్నవాటినే ఏరిపారేస్తోంది. కనీసం దివ్యాంగులపట్ల దయ చూపడం లేదన్నారు. టీడీపీ కూటమి సర్కారు ఇప్పుడు వీటిని కేవలం 62.19 లక్షలకే పరిమితం చేసిందన్నారు. ఏడాదిలో ఏకంగా దాదాపు నాలుగున్నర లక్షల పింఛన్లను ఎగ్గొట్టిందన్నారు. మళ్లీ మళ్లీ సదరం సర్టిఫికెట్లు తేవాలంటూ, వైద్య పరీక్షలు, వైకల్య శాతం కుదింపుతో ముప్పు తిప్పలు పెడుతోందన్నారు. 40 శాతం కంటే తక్కువగా వైకల్యం ఉందని, పింఛనుకు అనర్హులంటూ నియోజక వర్గంలో వందల మందికి లబ్ధిదారులకు నోటీసులు జారీ అవుతున్నాయంటూ ప్రభుత్వంపై మండిపడ్డారు.

ఎన్నో ఏళ్లుగా నెలనెలా అందే పింఛన్‌నే ఆధారం - దివ్యాంగుల సంఘం జిల్లా నాయకుడు, మెల్లగవల్లి రామాంజనేయులు: ఎన్నో ఏళ్లుగా నెలనెలా అందే పింఛన్‌నే నమ్ముకుని బతుకుతున్న దివ్యాంగులను చంద్రబాబు సర్కారు నిర్దయగా రోడ్డుకీడ్చేసిందన్నారు. ఇన్నాళ్లూ నిబ్బరంగా తీసుకుంటున్న పింఛన్‌కు ఇకపై మీరు అనర్హులంటూ గత వారం పది రోజులుగా కూటమి ప్రభుత్వం ఇస్తున్న నోటీసులతో పింఛన్‌దారులు కకావికలం అవుతున్నారన్నారు. చంద్రబాబు సర్కారు మానవత్వం లేకుండా వ్యవహరిస్తోందన్నారు. దివ్యాంగ సర్టిఫికెట్ కలిగి ఉండి గత పదేళ్లకు పైగా పింఛను పొందుతున్నా వారికి సైతం తాజా పరీక్షల్లో అనర్హులంటూ నోటీసులు జారీ అయ్యాయన్నారు. కార్యక్రమంలో దివ్యాంగులు మల్లికార్జున నాయక్, భాష, వైసిపి నాయకులు ఆలూరు మండల కన్వీనర్ మల్లికార్జున, ఆస్పరి మండల కన్వీనర్ బసవరాజు, మాజీ ఎంపీటీసీ భాస్కర్, చిన్న ఈరన్న, ముసనపల్లి సోమన్న, దేవనకొండ మండలం కన్వీనర్ కిట్టు, లుంబ, అరికేర వెంకటేష్, వీరేష్, తిక్క స్వామి, నాయకులు పాల్గొన్నారు.

మా కడుపు కొట్టకండి సార్..

విశాలాంధ్ర-చిప్పగిరి: ఏ పని చేతకాని వికలాంగుల పింఛన్లను తొలగించి మా కడుపు కొట్టకండి సార్ అంటూ మండల పరిషత్ కార్యాలయము ముందు వికలాంగులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం నందు రక్షణ మండల దివ్యాంగుల సమైక్య ఆధ్వర్యంలో పింఛన్లు రద్దు అయిన దివ్యాంగులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. దివ్యాంగులు మాట్లాడుతూ తమకు ఎలాంటి పని చేతకాదని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే పింఛన్ల పైనే ఆధారపడి కుటుంబాలను నెట్టుకొస్తున్నామని ఇప్పుడు ఆ పింఛన్లనే తొలగిస్తే తాము రోడ్డున పడి అడ్డుకోవలసిన దుస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ కారణాలతో తొలగించిన దివ్యాంగుల పింఛన్లను వెంటనే పునర్ధరించాలంటూ మండల అభివృద్ధి అధికారి అల్లా బకాష్‌కు వినతి పత్రం ద్వారా తెలిపారు. ఇందుకు స్పందించిన మండల అభివృద్ధి అధికారి అల్లా బకాష్ మాట్లాడుతూ తొలగించిన వికలాంగుల పింఛన్ల పునర్ధరణపై జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్తామన్నారు.

మూడోరోజు హోరాహోరీగా డిజేబుల్డ్ చాలెంజర్స్ క్రికెట్ పోటీలు

విశాలాంధ్ర- ఎమ్మిగనూరు రూరల్ : డిజేబుల్ ఛాలెంజర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పద్మశ్రీ మాచాని మెమోరియల్ ఛాలెంజర్స్ ట్రోఫీ సహకారంతో ఏర్పాటుచేసిన క్రికెట్ పోటీలు మూడవరోజు రసవతారంగ సాగాయి. శుక్రవారం స్థానిక వివర్స్ కాలనీ గ్రౌండ్లో ఉదయం పోలీస్ శాఖ జట్టు వర్సెస్ రెవెన్యూ శాఖ జట్టు మధ్య పోటీ జరిగింది. ఇందులో మొదట బ్యాటింగ్ చేసిన పోలీస్ శాఖ జట్టు నిర్ణీత 12 ఓవర్ల లో 7 వికెట్లు నష్టానికి 146పరుగుల భారీ స్కోర్ సాధించింది. తర్వాత బ్యాటింగ్కు దిగిన రెవెన్యూ శాఖ జట్టు నిర్ణీత 12 ఓవర్లలో90 పరుగులు చేసి తొమ్మిది వికెట్లు సమర్పించుకుంది. ఏ దశలోనూ రెవెన్యూ శాఖ జట్టు కోలుకోకపోగా పోలీస్ శాఖ జట్టు రెవెన్యూ శాఖ జట్టుపై 57 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. మధ్యాహ్నం జరిగిన పాత్రికేయల జట్టు వర్సెస్ ఉపాధ్యాయుల జట్టు తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన ఉపాధ్యాయుల జట్టు నిర్ణీత 12 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 144 పరుగులు చేయగా తర్వాత బ్యాటింగ్ చేసిన పాత్రికేయల జట్టు నిర్ణీత 12 ఓవర్లు 9 వికెట్ల నష్టానికి 118 పరుగులు మాత్రమే చేయగా ఉపాధ్యాయుల జట్టు పాత్రికేయుల జట్టుపై 26 పరుగుల తేడాతో విజయం సాధించింది. డిజబుల్డ్ ఛాలెంజర్స్ క్లబ్ సెక్రటరీ షరీఫ్, అన్వర్ బాష, ఇరుజట్ల టీం సభ్యులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి సన్మానం

విశాలాంధ్ర - కర్నూలు : ఈ నెల 9, 10వ తేదీల్లో బీహార్ రాష్ట్రంలో జరిగిన ఏషియా అండర్ 20 రగ్బీ ఛాంపియన్షిప్ పోటీల్లో పాల్గొని పతకం సాధించిన రాష్ట్రానికి చెందిన క్రీడాకారిని అక్షయ రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ అభినందిం చారు. నగరంలోని తన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏషియన్ రగ్బీ ఛాంపియన్షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారిని అక్షయను శాలువా కప్పి సన్మానించిన రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ ఆమెకు నగదు ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంస్య పతకం సాధించడం ద్వారా అక్షయ ఆంధ్ర రాష్ట్ర పేరు, ప్రతిష్టలను పెంచిందని చెప్పారు. ముఖ్యంగా రగ్బీ క్రీడా మన దేశంతో పాటు రాష్ట్రంలో ఇటీవలే ప్రారంభమైందని, ఇలాంటి క్రీడల్లో పోటీ తక్కువగా ఉన్న నేపథ్యంలో క్రీడాకారులు వాటిలో పాల్గొని ప్రతిభ కనబడటం ద్వారా మంచి గుర్తింపు పొందవచ్చు అని తెలిపారు. దీనికి తోడు ఉద్యోగ ఉపాధి అవకాశాలను కూడా పొందవచ్చు అని వివరించారు. క్రీడాకారిని అక్షయ మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ ఆకాంక్షించారు. రగ్బీ క్రీడా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా అధ్యక్షుడు గుడిపల్లి సురేంద్ర, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం నాయకుడు చిన్న సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆబాది సర్వేతో శాశ్వత హక్కు

విశాలాంధ్ర - పెద్దకడబూరు: ఆబాది సర్వే ద్వారా ఇంటి యజమానులకు శాశ్వత హక్కు లభిస్తుందని పంచాయతీ కార్యదర్శి దస్తగిరి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చిన్నతుంబలం గ్రామంలో పంచాయతీ కార్యదర్శి దస్తగిరి ఆధ్వర్యంలో ఆబాది సర్వే కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆబాది సర్వే ద్వారా ఇంటి యజమానికి శాశ్వత హక్కు పత్రం లభిస్తుందని తెలిపారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి ఇంటి కొలతలు తీసుకుని చెక్ బంధీ నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ముత్తమ్మ, మాజీ ఎంపీటీసీ యల్లప్ప, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: శతాధిక వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు గ్రామానికి చెందిన బోయ వల్లే మాదమ్మ (120) భర్త బోయ వల్లే ఓబన్న గత కొన్నేళ్ల కిందట మృత్యువాత పడ్డారు. శతాధిక వృద్ధురాలకు ఐదు మంది కుమా రులు, ముగ్గురు కూతుర్లు కాగా మనమళ్లకు, మనమరాళ్లకు వివాహాలు అయ్యాయి. పెద్దలు చిన్నలు అందరూ కుటుంబ సభ్యులు కలిసి 80 మంది ఉన్నారు. అందరి పెళ్లిళ్లు కల్లారా చూసిన మాధమ్మ మునిమనమాళ్ళతో సంతోషంగా గడిపేదన్నారు. గత కొన్ని రోజుల నుండి అనారోగ్య సమస్య ఏర్పడడం, వయోభారంతో మృతి చెందినట్లు వారు తెలిపారు. ఇంటికి పెద్ద దిక్కు మృత్యువాత పడ్డడంతో కుటుంబ సభ్యులు కన్నీళ్లు పెట్టుకున్నారు.

డీఎస్సీ నియామకాల్లో పారదర్శకత పాటించాలి

విశాలాంధ్ర - పెద్దకడబూరు: డీఎస్సీ నియామకాల్లో పారదర్శకత పాటించాలని ఏఐఎస్ఎఫ్ మండల ఉపాధ్యక్షులు లాలు, కార్యదర్శి షేక్షావలి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక సిపిఐ కార్యాలయం నందు విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ డీఎస్సీ ప్రక్రియ అభ్యర్థులను గందరగోళం చేసే విధంగా విద్యాశాఖ అధికారుల తీరు ఉందని విమర్శించారు. ముందుగా జిల్లాల వారీగా మొత్తం డీఎస్సీ మెరిట్ లిస్ట్, ర్యాంకులను విడుదల చేయకుండా, ప్రభుత్వం అభ్యర్థుల మెరిట్ లిస్టు మాత్రమే విడుదల చేసేందుకు సిద్ధం అవుతుండడం గందరగోళ పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు.

పింఛన్‌లు యధావిధిగా కొనసాగించాలి:సీపీఐ

విశాలాంధ్ర- పత్తికొండ: దివ్యాంగుల పింఛన్‌లను యధావిధిగా కొనసాగించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి.రాజా సాహెబ్, మండల కార్యదర్శి యు.కారుమంచి డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఐ ప్రతినిధి బృందం ఎంపీడీవో కవితకు వినతి పత్రం అందజే శారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సదరం సర్టిఫికెట్లు వెరిఫి కేషన్ పేరుతో తొలగించిన దివ్యాంగుల పింఛన్‌లను యధావిధిగా కొనసాగించి దివ్యాంగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, మండల సహాయ కార్యదర్శులు పెద్ద ఈరన్న, గిడ్డయ్య గౌడ్, కాశీ, జిల్లా సమితి సభ్యులు నెట్టికంటయ్య, నాయకులు రంగన్న, మాదన్న, సిద్ధ లింగప్ప, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర- పత్తికొండ: దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించాలని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక వైఎస్ఆర్సిపి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సదరం సర్టిఫికెట్ల రీవెరిఫికేషన్ పేరుతో లక్షలాదిమంది దివ్యాంగుల పెన్షన్లు తొలగించి వారికి తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. దివ్యాంగులకు వచ్చే పెన్షన్ తోనే చాలా కుటుంబాలు జీవనం గడుపుతున్నారని, మానవతా దృక్పథంతో తొలగించిన పింఛన్‌లను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ నారాయణ దాసు, వైసీపీ మండల కన్వీనర్ కారం నాగరాజు, మాజీ సర్పంచ్ సోమశేఖర్, నాయకులు బాబు రెడ్డి, శ్రీరంగడు, జిట్టా నాగేష్ పాల్గొన్నారు.

క్రీడల్లో బాలికలను ప్రోత్సహించాలి

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల: ఎక్కడైతే మహిళలు గౌరవించబడతారో ఆ దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని సీనియర్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. నగరంలోని ఆదర్శ విద్యా మందిర్ మైదానంలో ఏర్పాటు చేసిన అస్మిత రగ్బీ లీగ్ పోటీల బహుమతుల పదానోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రగ్బీ లీగ్ పోటీలలో బాలికలు అధిక సంఖ్యలో పాల్గొనటము, కేంద్ర ప్రభుత్వం విమెన్ ఎంపవర్మెంట్‌లో భాగంగా అన్ని రంగాలలో మహిళలు ప్రోత్సహించడం అభినందనీయమని చెప్పారు. ముఖ్యంగా ఏ ప్రభుత్వ శాఖలో అయితే మహిళలు పరిపాలన అధికారులుగా ఉంటారో ఆ శాఖలో అవినీతి తక్కువగా ఉంటుందని అది మహిళల గొప్పతనం అని వివరించారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో బాలికలకు ఆత్మ రక్షణ ఎంతో అవసరమని తెలిపారు.స్త్రీ శక్తిని సమర్ధవంతంగా వినియోగించుకుంటే మంచి ఫలితాలు ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రగ్బీ సంఘం ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా అధ్యక్షుడు సురేంద్ర, ప్రైవేట్ పీఈటిల సంఘం అధ్యక్షుడు చిన్న సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

నీట్ పీజీ ప్రవేశ పరీక్షలో మెరిసిన ఆణిముత్యం

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: ఇటీవల నిర్వహించిన నీట్ పీజీ ప్రవేశ పరీక్షలో కర్నూలు మెడికల్ కళాశాలకు చెందిన డాక్టర్ కుశినేని తనూజ ప్రతిభను కనపరిచారు. సీనియర్ జర్నలిస్టు కుసినేని గిడ్డయ్య, కుసినేని సావిత్రి దంపతులకు నాలుగో సంతానంగా జన్మించిన కుసినేని తనూజ ఐదో తరగతి వరకు గూడూరు పట్టణంలోని జ్యోతి పబ్లిక్ హై స్కూల్‌లో, పదో తరగతి వరకు గూడూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించారు. ఈ పాఠశాలలో పదో తరగతిలో అత్యధికంగా మార్కులు దక్కించుకున్నందుకు అప్పట్లో రాష్ట్రస్థాయిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరుపతిలో నిర్వహించిన ప్రతిభా అవార్డుల ప్రధాన ఉత్సవ కార్యక్రమంలో జిల్లా నుంచి మొదటి స్థానంలో నిలిచి ముఖ్యమంత్రి నుంచి అవార్డు అందుకున్నారు. నగరంలోని నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించారు. ఐదేళ్ల కిందట నిర్వహించిన నీట్ యూజీ ప్రవేశ పరీక్షలో ప్రతిభను కనపరిచి కర్నూలు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు దక్కించుకున్నారు .ఈ నెల మూడవ తేదీ నీట్ పీజీ ప్రవేశ పరీక్షను జాతీయ స్థాయిలో నిర్వహించారు. ఈ పరీక్షలో 573 మార్కులు సాధించి జాతీయస్థాయిలో 6670 ర్యాంకు దక్కించుకున్నారు. జాతీయ స్థాయిలో ఈ ర్యాంకు రావడం పట్ల ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు, పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులు హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారు. గతంలో నీట్ పీజీ పరీక్షలు రెండు సెషన్స్‌లో నిర్వహించేవారు. ఈ ఏడాది ఈనెల మూడవ తేదీ ఒకే సెషన్స్‌లో జాతీయ స్థాయిలో పరీక్షలు నిర్వహించారు. దేశ వ్యాప్తంగా నీట్ పీజీ పరీక్షలు రాసిన విద్యార్థులు హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రతిభ ఆధారంగా మార్కులు రావడంతో ఈ విధానాన్ని ఆమోదిస్తూ సర్వత్ర హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారు. కాగా నీట్ పీజీ ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనపరిచిన వారికి మొదట జాతీయ స్థాయిలో 50 శాతం కోటా కింద మెడికల్ పిజి సీట్లు భర్తీ చేస్తారు. ఆ తర్వాత రాష్ట్ర కోటాలో పీజీ మెడికల్ సీట్లను కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేస్తారు. కాగా తాను ఈ స్థాయికి ఎదగడానికి కారకులైన తల్లిదండ్రులు, గురువులు, సహకరించిన బంధుమిత్రులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆమె అన్నారు. పీజీలో సీటు సాధించి పేదలకు సేవ చేయాలన్నది తన లక్ష్యమని ఆమె తెలిపారు.

చెత్త కుప్పలను తొలగించండి

విశాలాంధ్ర-హొళగుంద: హొళగుంద జిల్లా పరిషత్ హైస్కూల్ పక్కల్లో ఉన్న మురికి నీటి కాలువ పూడికతో నిండి పోయింది. స్పందించిన టీడిపి నాయకుడు దిద్ది తిక్క స్వామి జెసిబి యంత్రం సహాయంతో పూడికను ఎత్తివేసి వదిలేశారు. మురికి నీటి కాలువలో పూడికను ఎత్తివేయడంతో ము రికి నీరు సులభంగా ప్రవహించాయి పూడిక తొలగించడం వల్ల మురికి నీరు నిల్వ ఉండకపోవడంతో ఎలాంటి దుర్వాసన రాకుండా పోయింది. అయితే మురికి నీటి కాలువలో తీసివేసినపూడికను రోడ్డు పక్కన వేయడంతో వాహనాలతో పాటు కాలిబాటను నడిచే వారికి ఇబ్బందికరంగా ఉన్నదనీ విద్యావంత యువకులు శుక్రవారం తెలిపారు. వర్షానికి పూడిక చిత్తడిగామారి మురికి నీటిలో కొట్టుకుపోతుందని అలాగే దుర్వాసన వస్తుందని అన్నారు. దీనివల్ల సీజనల్ వ్యాధులు ప్రభులే అవకాశం ఎక్కువ ఉన్నదని సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని చెత్తకుప్పలను ఎస్‌డబ్ల్యూపిసి సెంటర్‌కు తరలించాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.

మరిన్ని వార్తలు E-PAPERలో..

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, శనివారం 23, ఆగస్టు 2025

పారిశ్రామిక రంగంలో గణనీయమైన ప్రగతి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : జిల్లా పారిశ్రామికంగా గణనీయమైన ప్రగతి సాధిస్తోందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో బిజినెస్ రిఫార్మ్స్ యాక్షన్ ప్లాన్ -2024కు సంబంధించి పరిశ్రమల యాజమాన్యాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగా కర్నూలు జిల్లా ఓర్వకల్లు హబ్‌లో 5 వేల ఎకరాల్లో జైరాజ్ ఇస్పాత్, రిలయన్స్, అగస్త్యా, డ్రోన్స్ హబ్ తదితర కంపెనీలను ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. ఈ పరిశ్రమల ద్వారా వేల మందికి ఉపాధి కలుగుతుందన్నారు. పారిశ్రామిక హబ్‌కు నీటి సరఫరా పనులు కూడా 80శాతం పూర్తయ్యాయని, రోడ్లు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. జిల్లా మంత్రి టి.జి.భరత్ పరిశ్రమల శాఖకు మంత్రిగా ఉన్నందున, వారి కృషి వల్ల కూడా జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి సాధ్యమవుతోందని కలెక్టర్ తెలిపారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా పరిశ్రమల స్థాపనకు వేగంగా అనుమతులు మంజూరు చేస్తున్నామన్నారు. రెవెన్యూ, ఎలక్ట్రికల్, బాయిలర్స్, పొల్యూషన్ కంట్రోల్, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, లేబర్, అగ్నిమాపక శాఖ తదితర 18 శాఖలకు సంబంధించి గడువు లోపు అనుమతులు మంజూరుచేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో భాగంగా అనేక చర్యలు చేపట్టిందని కలెక్టర్ తెలిపారు. బిజినెస్ రీఫార్మ్ యాక్షన్ ప్లాన్ 2024కు సంబంధించి 435 రికమండేషన్స్‌తో కేంద్ర ప్రభుత్వ సంస్థ డిపార్ట్మెంట్ ఫర్ ప్రమోషన్ ఇండస్ట్రీ మరియు ఇంటర్నల్ ట్రేడ్ వారి ద్వారా ఫీడ్బ్యాక్ సర్వే నిర్వహిస్తోందన్నారు. సమావేశంలో ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి, డీడీ గ్రౌండ్ వాటర్ శ్రీనివాసులు,ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్ రెడ్డి, జైరాజ్ ఇస్పాత్, జియో మైసూర్, రిలయన్స్, అగస్త్యా తదితర పారిశ్రామిక సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.

అన్ని వర్గాలకు చంద్రబాబు మోసం

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : సూపర్ సిక్స్ పేరుతో అన్ని వర్గాలను ముఖ్యమంత్రి చంద్రబాబు మోసం చేశారని వైసీపీ కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం నగరంలోని ఎస్వీ కాంప్లెక్స్ వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో 4 లక్షల 30 వేల పెన్షన్లు రద్దు చేసీ, దివ్యాంగులకు అన్యాయం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దివ్యాంగుల సర్టిఫికెట్లలో పర్సెంటేజ్ తగ్గించాలని వైద్యులకు టార్గెట్ ఇస్తున్నారని, పింఛన్ల రద్దుకు వ్యతిరేకంగా రోడ్డెక్కారని తెలిపారు. వికలాంగ సర్టిఫికెట్లు పొందిన వారిని దొంగలుగా చిత్రీకరించడం దారుణమన్నారు. యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు, ఏ పంటకు మద్దతు ధర లేక రైతులు నష్టపోతున్నారని వాపోయారు. డీఎస్సీ మెరిట్ లిస్ట్ ఎందుకు ఇవ్వడం లేదని ఆయన ప్రశ్నించారు. రహస్యంగా ఎంపికైన వారికి సమాచారం ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారని, దీని వెనక మతలబేమిటో సమాధానం చెప్పాలన్నారు. విద్యాశాఖను మంత్రి చూడకుండా రెడ్ బుక్ చూస్తున్నారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర అయినా ఉద్యోగుల పీఆర్సిను నియమించలేదన్నారు. పీ4 స్పాన్సర్ల కోసం ఉద్యోగులపై ఒత్తిడి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కూటమి మంత్రులు పీ4 కింద ఎంతమందిని దత్తత తీసుకున్నారో ప్రజలకు చెప్పాలన్నారు. ఎమ్మెల్యేల అరాచకాలను నియంత్రించడంలో చంద్రబాబు విఫలమయ్యారని చెప్పారు. నందమూరి హరికృష్ణ భార్యపై ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ చేసిన వ్యాఖ్యలు దుర్మార్గం అన్నారు. నందమూరి హరికృష్ణ భార్యను దూషిస్తే ఎన్టీఆర్ ను దూషించినట్టే, ఎమ్మెల్యేని సస్పెండ్ చేయాలన్నారు. దివ్యాంగుల పక్షాన నిలబడి వైసీపీ పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నగర కార్పొరేటర్లు, జిల్లా అనుబంధ సంస్థ అధ్యక్షులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు

నూతనంగా సీబీ హార్నెట్ 125 సీసీ బైక్ ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: నంద్యాల పట్టణం టెక్కె రోడ్డు నందు పరమేశ్వర హోండా షోరూం నందు నూతనంగా హీరో హార్నెట్ 125 సీసీ బైక్‌ను ఏపీ జోనల్ ఇంచార్జి షరాద్ అంద్రేసాన్, ఏపీ సేల్స్ ఏరియా ఇంచార్జి ప్రజ్వల్ అంగ్వార్ సాన్, ప్రొప్రైటర్ నవీన్, ఏరియా సర్వీస్ ఇంచార్జి వినోద్ కలిసి ఆవిష్కరించారు. తక్కువ డౌన్ పేమెంట్తో అన్ని ఫైనాన్స్ కంపెనీలతో బైక్ ఫైనాన్స్ సౌకర్యం కల్పించడం జరుగుతుందని షోరూం నిర్వాహకులు తెలిపారు. అంతే కాకుండా ప్రారంభంలో వచ్చిన కస్టమర్లకు ప్రత్యేక బహుమతి అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా బైక్ ఫ్యూచర్స్ ను వారు వివరించారు.

రోడ్డు వేశారు.. బస్సు నడపండి సార్..

విశాలాంధ్ర - హొళగుంద: హొళగుంద నుండి హెబ్బన్నారు కొట్టాల వరకు ఉపాధి హామీ నిధులతో నాలుగు కోట్ల రూపాయలు ఖర్చు చేసి కూటమి ప్రభుత్వం కొత్త రోడ్డును నిర్మించింది. ఆలూరు నియోజక వర్గం టీడిపి ఇన్చార్జ్ వీరభద్ర గౌడ, తుంగభద్ర ఎల్ ఎల్ సి డిస్ట్రిబ్యూటీ కమిటీ చైర్మన్ ఎం.వెంకట శివప్రసాద్ కలెక్టర్ పి రంజిత్ భాష దృష్టికి తీసుకువెళ్లి నాలుగు కోట్ల రూపాయలను రోడ్డు నిర్మాణానికి మంజూరు చేయించుకుని రోడ్డు పనులు చేయించారు. కొత్త రోడ్డు నిర్మించడం వల్ల రెండు రాష్ట్రాల ప్రజలకు ఎంతో అనుకూలమైంది. రోడ్డు సక్రమంగా లేకపోవడంతో ప్రజలు ఎల్ఎల్సి దిగువ కాలువ గట్టు మీద ప్రయాణించి గ్రామాలకు తిరిగేవారు. ఎల్ఎల్సి దిగువ కాలువ మీద ప్రయాణించేవారు కాలువలో పడినా సంఘటనలు జరిగాయి. కొత్త రోడ్డు నిర్మించారని కొత్త బస్సు మరిచారని ప్రజలు వాపోయారు. ఇప్పటికైనా సమంత జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని కొత్త రోడ్డు మీద కొత్త బస్సు నడిచేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేశారు. కొత్త బస్సు నడిస్తే మహిళలకు వైద్య సౌకర్యం, విద్యార్థులకు విద్యా సదుపాయం కలుగుతుందని, రవాణా సౌకర్యం అందుబాటులో ఉంటే సమస్యలు తీరుతాయని ప్రజలు తెలిపారు.

దివ్యాంగుల పింఛన్‌లు తొలగిస్తే సహించం

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : దివ్యాంగుల పెన్షన్లు తొలగించి వారి కడుపులు కొడితే సాహించేది లేదని సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని బాష కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ గతంలో సదరం క్యాంపులు నిర్వహించి ముగ్గురు డాక్టర్ల పర్యవేక్షణలో పరీక్షించి సర్టిఫికెట్లు మంజూరు చేస్తే, ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం రీ వెరిఫికేషన్ పేరుతో 35 నుండి 40 ఏళ్ళ నుండి తీసుకుంటున్న దివ్యాంగుల పెన్షన్లను తొలగించడం సరికాదన్నారు. రీ వెరిఫికేషన్ పేరుతో ఇతర జిల్లాల నుంచి అవగాహన, అనుభవం లేని డాక్టర్లతో పరిశీలన చేయిస్తున్నారని, వారు భౌతికంగా పరీక్షించకుండానే ఇష్టం వచ్చినట్టు పర్సంటేజ్లు వేశారని దుయ్యబట్టారు. ఈ చర్య వల్ల నిజమైన దివ్యాంగులు మానసిక క్షోభకు గురై ఆత్మహత్య ప్రయత్నాలు చేసుకుంటున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రద్దు చేసిన పెన్షన్లను పునరుద్ధరించాలన్నారు. లేనిపక్షంలో దివ్యాంగులకు అండగా కాంగ్రెస్ పార్టీ వారికి న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. అనంతరం కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ, మాజీ డిసిసి కార్యదర్శి అబ్దుల్ హై, 11వ వార్డు ఇన్చార్జి ఎన్ సుంకన్న పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్తు పథకాన్ని వర్తింపజేయండి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ మండలంలో ఉన్న చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ పథకాన్ని వర్తింపజేయాలని ట్రాన్స్‌కో ఏఈ వెంకటకృష్ణయ్యకు జాతీయ చేనేత ఐక్యవేదిక నాయకులు ఉప్పుసుబ్బరాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం వినతి పత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేనేత పరిశ్రమలకు తోడ్పాటు నివ్వాలన్న ఉద్దేశంతో చేనేతలకు నెలకు రెండు వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును అందించేందుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా పట్టణంలోని పలువురు చేనేత కార్మికులు ట్రాన్స్కో ఏఈ కార్యాలయంలో ఏఈ వెంకటకృష్ణయ్యను కలిసి వినత పత్రం అందజేసి వారి దరఖాస్తులను ఆయనకు ఇవ్వడం జరిగింది. ఏఈ కృష్ణయ్య వెంటనే స్పందించి వారి దరఖాస్తులను పరిశీలించి జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఉచిత విద్యుత్ పథకం వర్తించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మికులు మోహన్ రావు, రామయ్య, ఉప్పు నారాయణ, చంద్రశేఖర్, మోహన్, శంకర్ తదితరులు ఉన్నారు.

మలేరియా నివారణకు చర్యలు

విశాలాంధ్ర - చాగలమర్రి : గ్రామాల్లో మలేరియా నివారణకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు జిల్ల మలేరియా అధికారి చంద్రశేఖర రావు తెలియజేసారు.మండలంలోని వనిపెంట చెంచుగూడెంలో శుక్రవారం డ్రైడే చర్యలను పరిశీలించారు. సహాయ జిల్లా మలేరియా అధికారి సత్యనారాయణ, ఆళ్ళగడ ఆళ్ళగడ్డ సబ్‌యూనిట్ మలేరియా అధికారి శివచంద్రారెడ్డి, ఆరోగ్య విస్తరణ అధికారులు వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, సిహెచ్ఓ కృష్ణమ్మ, ఏఎన్ఎం కమలా భాయి, ఆశా కార్యకర్తలు పుష్పలత, రామేశ్వరమ్మ, వెంకటేశ్వరిలు పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

విశాలాంధ్ర - ఆస్పరి: ఈ నెల 27వ తేదీన వినాయక చవితి పండుగ సందర్భంగా మండల పరిధిలోని మండపాలలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకుని ఉత్సవాలు జరుపుకోవాలనుకునే వారు తప్పనిసరిగా పోలీసుశాఖ నుండి అనుమతి పొందాలని సిఐ గంగాధర్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ మాట్లాడుతూ గ్రామాల్లో వివిధ ప్రదేశాల్లో నిర్వహించ తలపెట్టిన వినాయక చవితి ఉత్సవాలను పండుగ వాతావరణంలో అత్యంత భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ సూచించారు. విగ్రహాల ఏర్పాటుకు సంబంధించిన పూర్తి సమాచారం ఆన్‌లైన్ ద్వారా పోలీసు శాఖకు అందించాలన్నారు.

షెడ్యూల్ కులాల యువతకు ఏపీ మోటర్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం వారు మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ నిమిత్తం 20 ఏళ్లపైబడిన ఆసక్తిగల అభ్యర్థులు కనీసం ఏడాది కాల పరిమిత గల లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉన్న పురుషులు స్త్రీలు నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తులసీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21వ తారీకు నుంచి 27 తేదీ లోపల దరఖాస్తులను సమర్పించాలన్నారు. ఈ శిక్షణకు ఐదుగురు స్త్రీలు, ఐదుగురు పురుషులు అభ్యర్థులను మాత్రమే ఎంపిక జరుగుతుందని, శిక్షణకు సంబంధించిన ఫీజు కార్పొరేషన్ ద్వారా భరించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తగు సమాచారం నిమిత్తం ఫోన్ నెంబర్ 7032995543 సంప్రదించాలని సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణ

విశాలాంధ్ర - సి.బెళగల్ : మండల కేంద్రంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించగా ఈ కార్యక్రమానికి ఆర్‌డిఓ కిదారి సందీప్ కుమార్ హాజరై రెవిన్యూ అధికారుల సమక్షంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఆయా గ్రామాల నుండి వచ్చిన రైతులు చుక్కల భూములు నుండి విముక్తి కల్పించాలని, జాయింట్,ఆన్లైన్ సమస్యలు ఉన్నాయని, భూమి కొలతలు సక్రమంగా చేయాలనీ, పట్టా పాసుపుస్తకాలు ఇవ్వాలని, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, రస్తా సమస్యలు ఇలా అనేక రకాల సమస్యలు పరిష్కారం కావడం లేదని పలువురు ప్రజలు ఒక్కొక్కరిగా వినతులను అందజేశారు. ఆర్‌డిఓ నేరుగా ప్రజల నుండి141 వినతులను స్వీకరించి ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని తహసీల్దార్ వెంకట లక్ష్మి కు,ఎంపీడీఓ రాణెమ్మకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల వీఆర్వోలు తదితర రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మిశ్రమ కర్మాగారాలను తనిఖీ చేసిన అధికారులు

విశాలాంధ్ర - నంద్యాల రూరల్ : పట్టణంలోని డైరీ, ప్లాస్టిక్, పశువుల దాన చిన్నపాటి మిశ్రమ కర్మాగారాలను మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ సిబ్బందితో కలిసి శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి ప్రసాదరావు మాట్లాడుతూతనిఖీలలో భాగంగా నంది డైరీ ప్రొడక్ట్స్, మంజూశ్రీ టెక్నోప్యాక్, మార్కుఫెడ్ పశువుల దాణా మిశ్రమ కర్మాగారం యందు బృందం యూరియా నిల్వల గురించి తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. తనిఖీలలో పాల ఉత్పతులు, ప్లాస్టిక్, పశువుల దాణాకి ఉపయోగించే వివిధ రకాల ముడి సరుకులని పరిశీలించారు. తనిఖీలలో ఎలాంటి యూరియా నిల్వలు కనపడలేదని, తనిఖీలలో పాల్గొన్న బృందం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తనిఖీలలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ ప్రసాద్ ఏఎస్ఐ ఉస్సేన్, పశు వైద్యాధికారి శ్రీనివాస రెడ్డి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మార్గరెట్ పాల్గొన్నారు.

రోడ్డు గుంతల్లోని నీరు తొలగింపు

విశాలాంధ్ర- హొళగుంద: హొళగుంద వయా హెబ్బటం, ధనాపురం వరకు రోడ్డు అధ్వాన్నస్థితికి చేరి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగించింది. భారీ వర్షానికి రోడ్డు మధ్యలో భారీ గుంతలు ఏర్పడి బస్సులు, లారీలు, ఆటోలు దాటిపోవాలన్న కష్టంగా మారింది. ఆర్టీసీ బస్సులు రోడ్డు సక్రమంగా లేక మార్గమార్గంలో చెడిపోతున్నాయని వెంటనే రోడ్డు మరమ్మత్తు చేయాలంటూ ఆర్ అండ్ బి అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు స్పందించిన డిఈ వెంకటేశ్వర్లు, ఎ ఈ సాయి సురేష్ జెసిబి మిషన్ ద్వారా పెద్దపెద్ద గుంతల్లో నిలబడిన నీటిని తొలగించి మట్టిని వేశారు. రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతల్లో వర్షం నీటిని అధికారులు తొలగించడం వల్ల వాహనాల రాకపోతలకు ఎంతో అనుకూలమైందని వాహనాల యజమానులు శుక్రవారం తెలిపారు.

ప్రత్యేక అలంకరణలో వాసవి మాత

విశాలాంధ్ర-అవుకు: పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవి మాత శుక్రవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణ మాస చివరి శుక్రవారం సందర్భంగా ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు జూటూరు రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో మహిళా సంఘం సభ్యులు వాసవి మాతను తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా సంఘం సభ్యులు ఆలపించిన అమ్మవారి భక్తి గీతాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అనంతరము భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఎస్సీ కులస్తులకు ఇచ్చిన భూములపై విచారణ

విశాలాంధ్ర - జనగానపల్లె : మండల పరిధిలోని తమడపల్లె గ్రామపంచాయతీ పరిధిలోని జంబులదిన్నె గ్రామంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎస్సి మహిళలకు ఎస్సీ కార్పొరేషన్ పంపిణీ చేసిన భూములు ఇచ్చారు. ఈ భూములు వివాదాస్పదం కావడంతో నంద్యాల ఆర్డీవో శుక్రవారం ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తులసి దేవి ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. 2016-17లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎస్సీ మహిళలకు ఒక ఎకరా భూమి రూ.6 లక్షల చొప్పున విక్రయించింది. వారి పేర్ల మీద పాసు పుస్తకాలు మంజూరు చేశారు. ఎస్సీ కార్పొరేషన్ ఇచ్చిన భూమి సాగుకు అనుకూలమైనది కాకపోవడంతో లబ్దిదారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డోన్ ఆర్డిఓ నరసింహులు విచారణ చేపట్టారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తులసి దేవి మాట్లాడుతూ జంబులదిన్నె గ్రామంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 11 ఎకరాలు పంపిణీ చేయగా ఐదు ఎకరాల్లో వాగు ప్రవహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ నారాయణరెడ్డి, రైతులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

గణేష్ పండుగకు అనుమతి తప్పనిసరి

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: గణేష్ పండుగ వేడుకకు ప్రతి ఒక్కరు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్సై కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన పోలీస్ స్టేషన్ ఆవరణంలో వివిధ గ్రామాల ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వినాయక చవితి పండుగను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఎవరు వివాదాలకు తావివ్వకుండా పరస్పర సహకారంతో పండుగను సంతోషంగా జరుపు కోవాలన్నారు. కుల, మత, బేధం తేడా లేకుండా శాంతి భద్రతలకు ప్రాధాన్యత ఇచ్చి సమాజంలో ఐక్యమత్యం చాటాలని ఆయన తెలిపారు. అనుమతులతో గణేష్ విగ్ర హాలు ఏర్పాటు చేసుకొని గొడవలు లేకుండా నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు.

ఆళ్ళగడ్డలో ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - ఆళ్ళగడ్డ : పద్మవిభూషణ్, మెగాస్టార్ కొణిదెల చిరంజీవి జన్మదిన వేడుకలు ఆళ్లగడ్డలో ఘనంగా నిర్వహించారు. ఆళ్ళగడ్డ నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో ఆళ్ళగడ్డ నియోజకవర్గ చిరంజీవి యువత అధ్యక్షులు రాచంశెట్టి చిన్న పెద్దయ్య, ఆళ్లగడ్డ నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త మైలేరి మల్లయ్య , మెగా అభిమానులు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి చిరంజీవి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం చిన్న పెద్దయ్య, మైలేరి మల్లయ్య లు మాట్లాడుతూ తెలుగు చిత్ర పరిశ్రమలో అపూర్వ నటుడుగా వెలుగొందుతూ బ్లడ్ బ్యాంకు, ఐ బ్యాంకు స్థాపించి ప్రజలకు సేవలందించిన మహానటుడు చిరంజీవి అన్నారు.

స్వర్ణాంధ్ర 2047పై సమీక్ష సమావేశం

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.శాంతి కళ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం ప్రోగ్రాం అధికారులతో స్వర్నాద్ర 2047పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కమిషనర్ అఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ వారి పరిధిలో జిల్లా స్థాయిలో 5 సూచికలు, మండల స్థాయిలో 18 సూచికలు, తదుపరి డైరెక్టర్ అఫ్ పబ్లిక్ హెల్త్ వారి పరిధిలో జిల్లా స్థాయిలో 5 సూచికలు, మండల స్థాయిలో 2 సూచికలు ఉన్నాయని వీటి ప్రగతిని ప్రోగ్రాం అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. వీటి వలన 2047 సంవత్సరము నాటికి సంపన్నమైన, ఆరోగ్యకరమైన, ఆనంద ఆంధ్రప్రదేశ్‌ను సాదించేందుకు దోహదపడునని తెలిపారు. ఈ సమీక్షా సమావేశములో డిపిఎమ్ఓ డాక్టర్ ఉమ, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్.నాగప్రసాద్ బాబు, ఎస్ఓ హేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలి

విశాలాంధ్ర - కోడుమూరు : ఈ నెల 27నుంచి మొదలయ్యే వినాయక చవితి పండగ వేడుకలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని కోడుమూరు సీఐ తబ్రేజ్ కోరారు. వినాయక చవితి పండగ ఉత్సవాలు పురస్కరించుకొని శుక్రవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్సై డి ఎర్రిస్వామి ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవ కమిటీలు,ముస్లిం కమిటీ సభ్యులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా ఎవరూ వివాదాలకు తావివ్వకుండా పరస్పర సహకారంతో పండుగను ఘనంగా నిర్వహించాలని సూచించారు.

డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌ను కలిసిన ఏకలవ్య ట్రైబ్స్ ఫెడరేషన్ ప్రతినిధులు

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: ఏకలవ్య ట్రైబ్స్ ఫెడరేషన్ వ్యవస్థాపకులు రాష్ట్ర అధ్యక్షులు నల్లబోతుల కొండయ్య, ఏకలవ్య ప్రగతి ఐక్యవేదిక వ్యవస్థాపకురాలు స్టేట్ మహిళా కార్యదర్శి నల్లగుంట్ల శైలజ, స్టేట్ జనరల్ సెక్రటరీ దేవరకొండ విజయ కుమార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ బి.రామ కోటేశ్వరరావుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కేసులను వ్యాపారంగ మలుచుకుంటున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న తంబళ్లపల్లి పబ్లిక్ ప్రాసిక్యూటర్ సి.వీరాంజనేయులుపై ఈటీఎఫ్ తరఫున గతంలో చేసిన ఫిర్యాదు గురించి చర్చించారు.

సమస్యల పరిష్కారానికి ఆటో కార్మికులందరూ సంఘటితం కావాలి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డును వెంటనే ఏర్పాటు చేసి డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ప్రతి ఆటో కార్మికునికి ఏడాదికి వాహన మిత్ర పథకం ద్వారా ఏడాదికి 25 వేల రూపాయలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడు, సిఐటియు జిల్లా నాయకులు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆళ్లగడ్డ పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద పట్టణ మరియు గ్రామాలకు తిరిగే ఆటో డ్రైవర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరిగిన నిరుద్యోగ సమస్యతో ఉపాధి లేక ఉన్నత చదువులు చదివి కూడా ఉద్యోగాలు రాకపోవడంతో బతుకు బారమై జీవనోపాధి కోసం ఆటో తోలుకుంటూ జీవనం సాగిస్తున్న ఆటో కార్మికులు ఆళ్లగడ్డ నియోజకవర్గంలో చాలామంది ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన స్త్రీ శక్తి పథకం అమలు జరిగిన వారం రోజుల్లోనే ఆటో కార్మికులకు సరైన బాడుగలు లేక, ఉపాధి కరువై దుర్భరమైన జీవితాన్ని గడిపే పరిస్థితి ఏర్పడిందన్నారు. రోజువారి ఆటో నడి స్తేనే బతుకు బండి నడిచి మూడు పూటల అన్నం దొరికి పరిస్థితి ఉన్న ఆటో కార్మికులకు నేడు భోజనం కరువయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. గత ప్రభుత్వంలో ఒక్కో ఆటో డ్రైవర్ కు ఏడాదికి 10 వేల రూపాయలు ఇచ్చేవారని, ప్రస్తుతం ముఖ్యమంత్రి మొండి చెయ్యి చూపిస్తున్నాడని, అందువల్ల నియోజకవర్గం లోని ఆటో కార్మికులందరూ సంఘటితం కావాలన్నారు.ఈ సమావేశంలో ఆళ్లగడ్డ సిఐటియు నాయకులు రమేష్, ఆళ్లగడ్డ ఆటో యూనియన్ నాయకులు లింగమయ్య, మహేష్, రఫీ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కలను నియంత్రించడంలో విఫలం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : వీధి కుక్కల సంఖ్యను నియంత్రించడంలో ఆళ్లగడ్డ మున్సిపాలిటీ, ఎమ్మెల్యే విఫలమయ్యారని ఎస్డిపిఐ నాయకులు విమర్శించారు. శుక్రవారం ఆళ్లగడ్డ మున్సిపాలిటీ కార్యాలయం వద్ద సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా ఆళ్లగడ్డ అసెంబ్లీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వ హించారు. ఎస్డిపిఐ నంద్యాల జిల్లా నాయకులు జాఫర్, ఆళ్లగడ్డ అసెంబ్లీ అధ్యక్షులు ముక్తార్ మాట్లాడుతూ ఆళ్లగడ్డలో మరియు చుట్టుప్రక్కల ప్రాంతాలలో కుక్కల సమస్య విపరీతంగా పెరిగి పోయిందన్నారు. ఎక్కడ చూసినా, ఏ సందులో చూసినా విపరీతంగా కుక్కలు తిరుగుతూ ముఖ్యంగా చిన్నపిల్లలను, వృద్ధులను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్నాయని గతంలో ఎంతో మంది పిల్లలు వీధి కుక్కల బారినపడి రేబిస్ తో చనిపోవడం జరిగింద న్నారు. మాలల సంక్షేమ అభివృద్ధి సంఘం నాయ కులు పెనం సుధాకర్ మాట్లాడుతూ కుక్కలకు యాంటీ రాబిస్ వ్యాక్సిన్ వేయడంలో కూడా మున్సి పల్ అధికారులు విఫలమయ్యారని తెలుపుతూ ఇప్ప టికైనా స్థానిక మున్సిపల్ అధికారులు చొరవ తిసు కొని కుక్కల సంఖ్యను పెరగకుండా ఆపి ఆళ్లగడ్డ పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజల ప్రాణాలు కాపా డాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా నాయకులు రామచంద్రుడు, ఆళ్లగడ్డ జేఏసీ కన్వీనర్ బీరువాల బాషలు మాట్లా డుతూ కుక్కకాటుకు గురై చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని రాత్రిపూట కుక్కల గుంపులు ఒంటరిగా వచ్చే ప్రజలపై దాడులు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం చాలా విచార కరమని తెలిపారు. వెంటనే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఓబులేసు, గుర్రం సామేలు, నాగళ్ళ కరుణాకర్, మేకల యేసు, బండి విజయకుమార్, అడ్వకేట్ గౌస్మొద్దీన్, ఫక్రుద్దీన్ మరియు ఎస్డిపిఐ నాయకులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలి

విశాలాంధ్ర - సి.బెళగల్: మండలంలోని రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రాన్ని ఆయన సందర్శించి మాట్లాడుతూ రైతులకు యూరియా కొరత లేకుండా చూసి నాణ్యమైన ఉత్పత్తులతో పాటు ఎరువులను సకాలంలో అందించి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆయన అన్నారు. యూరియా స్టాక్ అయిపోయిన వెంటనే రైతు సేవ సిబ్బంది మార్క్‌ఫెడ్ ద్వారా యూరియాను తెప్పించుకొని రైతు సేవా కేంద్రాలలో నిలువ ఉంచుకొని రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆర్డీఓ సందీప్ కుమార్ వ్యవసాయ సిబ్బందికి సూచించారు. ప్రైవేట్ డీలర్ల వద్ద ఉన్న యూరియాను కూడా అవసరమైతే రైతులకు అందించాలని మరియు డీలర్లు అధిక ధరలకు విక్రయించి నట్లయితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంట మండల వ్యవసాయ అధికారి మల్లేష్ కుమార్, వ్యవసాయ సిబ్బంది విఏఏలు ఆసిఫ్, శాలిని, ఎంపీఈఓ వెంకటేశ్వర్లు తదితర వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.